నమస్తే తెలంగాణ
నల్లగొండ
I నల్లగొండ, సోమవారం 21 ఏప్రిల్ 2025 NALGONDA

## ఆన్‌లైన్‌లో బెట్టింగ్.. 8 మంది అరెస్టు

నేరేడుచర్ల/హుజూర్‌నగర్, ఏప్రిల్ 20 : క్రికెట్, రమ్మీ, లోగన్ కప్పు ఆటలపై ఆన్‌లైన్‌లో బెట్టింగ్ పెడుతున్న 8 మందిని హుజూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 18న నమస్తే తెలంగాణలో ఐపీఎల్ హోరు.. బెట్టింగ్ జోరు అనే కథనానికి స్పందించిన పోలీసులు దానికి కారకులైన కొంత మందిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను హుజూర్‌నగర్ ఎస్‌ఐ ముత్తయ్య వెల్లడించారు. హుజూర్ నగర్, మేళ్లచెర్వు, విజయవాడ, రాయినిగూడెం గ్రామానికి చెందిన షేక్ ఖలీముద్దీన్, పొట్టి కోటయ్య, షేక్ అయూబ్ పాషా, పొట్టేపంగు కాటయ్య, తోడేటి గోపీకృష్ణ, తిరుమలశెట్టి రామ్మోహన్ రావు, సామల నర్సింహారెడ్డి, వాడపల్లి నర్సింహారావు కొంత కాలం నుంచి ఆన్‌లైన్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లకు బెట్టింగ్ పెడుతున్నారు. ఎనిమిది మంది బెట్టింగ్ పెట్టి వచ్చిన డబ్బులు పంచుకుందామని, అలాగే ఆదివారం మధ్యాహ్నం జరుగుతున్న పంజాబ్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగూళూర్ మ్యాచ్ నిమిత్తం బెట్టింగ్ పెట్టేందుకు హుజూర్‌నగర్ పట్టణంలోని నల్లగొండ పాన్ షాప్ వద్దకు వచ్చారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆ షాప్ వద్ద వెళ్లి పోలీసులు వారిని పట్టుకున్నారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్లు, రూ.3,400 నగదు సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.ముత్తయ్య తెలిపారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన బీఆర్‌ఎస్

- పదేండ్ల కేసీఆర్ పాలనలో సంతోషంగా ప్రజలు
- బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలి
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

బొమ్మలరామారం, ఏప్రిల్ 20 : తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపింది బీఆర్‌ఎస్ పార్టీ అని, పదేండ్ల కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలకు ప్రజలకు మేలు జరిగిందని మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభపై ఆదివారం బొమ్మలరామారం మండలంలోని యావాపూర్‌లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో సుఖ సంతోషాలతో ఉన్న రైతులు, చేతి వృత్తుల వారు నేడు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో అనేక హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేసిందని తెలిపారు. హామీలు అమలు చేయడానికి నిధులు లేవని చెప్పడం పాలన చేతగానితనమేనని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రణాళికలు రచించాలని సూచించారు. రజతోత్సవ సభకు ఆలేరు నియోజక వర్గం నుంచి అభిమానులు, ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సభ ద్వారా కేసీఆర్ రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్, మాజీ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ గుర్రాల లక్ష్మారెడ్డి, మాజీ భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కుషంగల సత్యనారాయణ, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గూదె బాల నర్సింమ, కొండోజు ఆంజనేయులు, బాల్ సింగ్, బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

# చలో వరంగల్‌కు ఎడ్ల బండ్లు

## బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేందుకు సన్నద్ధం

- ఆత్మకూర్.ఎస్ మండలం నుంచి స్వచ్ఛందంగా రైతుల ఏర్పాట్లు
- వారం ముందే బయల్దేరి సభనాటికి ఎల్కతుర్తి చేరుకునేలా ప్రణాళిక
- ఈ నెల 22న ప్రారంభించనున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేందుకు ఆత్మకూర్.ఎస్ మండలం రామోజీతండాలో ఎడ్ల బండ్లను ముస్తాబు చేస్తున్న రైతులు

సూర్యాపేట, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఉద్యమ కాలం నుంచి పదేండ్ల పాలనలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన కార్యక్రమాలు, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేద, మధ్య తరగతి జీవితాల్లో వెలుగులు నింపాయి. ఈ నేపథ్యంలో 25 ఏండ్ల గులాబీ పార్టీ పండుగకు సబ్బండ వర్గాల ప్రజలు వచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా రైతులు వినూత్న రీతిలో సభకు వచ్చేలా ఎడ్ల బండ్లు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ పాలనలో సాగు నీళ్లు రాక, కరెంట్ సరిగా లేక పంటలు ఎండిన రైతులు కడుపుకాలి రేవంత్‌రెడ్డి సర్కారుపై ఆగ్రహాన్ని వెళ్లగక్కేందుకు మండుటెండలను లెక్కచేయకుండా వారం రోజులపాటు దాదాపు 130 కిలోమీటర్లు ప్రయాణించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు సూర్యాపేట నియోజకవర్గం ఆత్మకూర్.ఎస్



మండలం రామోజీతండా, నశింపేట తదితర గ్రామాల నుంచి 25 మంది రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం కొద్ది రోజులుగా పాత ఎడ్ల బండ్లు ఉన్న వారు బాగు చేయిస్తుండగా కొంతమంది ఏకంగా కొత్త బండ్లను చేయించుకొని ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 22న ఆత్మకూర్.ఎస్ మండలం దండు మైసమ్మ తల్లి వద్ద పూజలు చేసి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎడ్ల బండ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### కాళేశ్వరంతో సస్యశ్యామలం

సాగునీటికి నోచుకోని సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలను కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి జలాలు అందించి మాజీ సీఎం కేసీఆర్ సస్యశ్యామలం చేశారు. దశాబ్దాలుగా నీళ్ల చుక్కకు ఎరుగక బీడుగా ఉన్న తమ భూములను బీఆర్‌ఎస్ పాలనలో ఇంచు భూమి వదలకుండా సాగు చేశామని రైతులు చెబుతున్నారు. ఈ మాయదారి కాంగ్రెస్ రాగానే మళ్లీ నీళ్లు బంద్ కావడంతో పంటలు ఎండిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని రంగాలతోపాటు రైతాంగాన్ని కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకున్నారని, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కాళేశ్వరం నీళ్లతో ఎండిన చెరువులు నింపి పంటలకు ఇబ్బంది లేకుండా చేశారని అంటున్నారు. నాడు మండు వేసవిలో చెరువులు నింపి అలుగులు పోయిస్తే కాంగ్రెస్ పాలనలో మంచినీళ్లు కూడా దొరకడం కష్టతరంగా మారిందని పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏదో చేస్తుందనుకుంటే మళ్లీ నీళ్ల కష్టాలు వచ్చాయని, పంటలు పండక రైతులు, ప్రజలు మళ్లీ వలస పోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ పాలనే బాగుందని, మళ్లీ ఆయన వస్తేనే జనానికి ఏ ఇబ్బంది ఉండదనే ఉద్దేశంతో వరంగల్ సభకు ఎడ్ల బండ్లపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

### కంటికి రెప్పలా కాపాడిన కేసీఆర్‌కు మద్దతివ్వాలనే..



రైతాంగానికి అన్నీ ఇచ్చి కంటికి రెప్పలా కాపాడుకున్న కేసీఆర్‌ను చూడాలి. ఆయన చెప్పే మాటలు వినాలి. ఆయనకు మద్దతు ఇవ్వాలనే నేను వరంగల్ సభకు వెళుతున్న. ఏండ్లకు ఏండ్లు నీళ్లు చూడని మాకు కేసీఆర్ పుణ్యమా అని జగదీశ్‌రెడ్డి సారు నీళ్లు తెస్తే పుష్కలంగా పంటలు పండించాం. ఇయ్యాళ కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ నీళ్ల గోసను చూపిస్తున్నది.

-గుగులోతు పార్వతి, రామోజీతండా, ఆత్మకూర్.ఎస్ మండలం

### కేసీఆర్ మాటలు వినాలనే పోతున్నా



పోయిన సారి ఎన్నికలప్పుడు కేసీఆర్ సారు వచ్చి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి బేజారు కావద్దని మరీ మరీ చెప్పినా ఏదో చేస్తారని ఓటు వేసినం. నమ్మి మోసం పోయినం. నీళ్లు లేక పంటలు ఎండితే జగదీశ్‌రెడ్డి సారు పరిశీలించి ధైర్యం చెప్పిండు. ఇప్పుడు కేసీఆర్ సారుకు అధికారం లేకున్నా 'మళ్లీ మీరే వస్తారు.. మా మద్దతు మీకే' అని చెప్పేలా ఎడ్లబండ్లపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నం. కేసీఆర్ సారు మాకు ధైర్యం చెబుతాడనే వరంగల్ వెళుతున్నాం.

- తంగెళ్ల శ్రీనివాస్‌రెడ్డి, నశింపేట, ఆత్మకూర్.ఎస్ మండలం

### కాంగ్రెస్ దివాళాకోరుతనం రాష్ట్రం మొత్తం తెలియాలనే..



ఆనాడు కేసీఆర్ సారు ఇస్తానన్నయే కాకుండా ఎన్నో పథకాలు ఇచ్చి ఆదుకుండు. అందరికీ అన్నీ ఇచ్చిండు. కానీ కేసీఆర్ కంటే అనేకం ఇస్తానని చెప్పి ఓట్లు వేయించుకున్న రేవంత్ రెడ్డి ఏమీ చేయక మోసం చేస్తున్నడు. ఎర్రటి ఎండల్లో ఎడ్లబండ్లపై పోయి కాంగ్రెస్ ప్రభుత్వ దివాళాకోరు తనాన్ని అందరికీ తెలియజేసేందుకే వరంగల్ వెళ్తున్నాం.

-బాణోతు హరి, రామోజీతండా, ఆత్మకూర్.ఎస్ మండలం



ఎల్కతుర్తిలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

## చరిత్రలో నిలిచిపోయేలా వరంగల్ సభ

- మునుగోడు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చేందుకు సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి
- ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలన

మర్రిగూడ/మునుగోడు, ఏప్రిల్ 20 : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ విజయవంతానికి పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతున్నామని, ఈ సభ చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గ ముఖ్య నేతలతో కలిసి ఆదివారం వరంగల్‌కు చేరుకొని సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కూసుకుంట్ల మాట్లాడుతూ సభ ప్రాంగణంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. 25 సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యంలో చేసిన పోరాటాలు, సాధించిన విజయాలు స్మరించుకుంటూ మార్గనిర్దేశనానికి ఈ సభ పునరుత్తేజం కల్గించనుందని తెలిపారు. కేసీఆర్ నిర్వహించే ప్రతి బహిరంగ సభ ప్రభంజనమేనన్నారు. ఈ సభ సక్సెస్‌ను చూసేందుకు దేశంలోని రాజకీయ పార్టీలు, మేధావులు ఎంతో ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సభకు రావడానికి ఎంతో ఉత్సాహం కనబరుస్తున్నారని తెలిపారు. పార్టీ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ శ్రేణులు సన్నద్ధమై సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ మోహన్ రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ దంటు జగదీశ్, సీనియర్ నాయకులు మునగాల వెంకటేశ్వర్ రావు, రామిడి వెంకటరమణారెడ్డి, అయిలీ లక్ష్మీనర్సింహ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తోటకూరి శంకర్ యాదవ్, గుమ్మడపు నర్సింహారావు తదితరులు ఉన్నారు.




వర్క్ షాప్‌కు హాజరైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓయూ సీనియర్ ప్రొఫెసర్ చెన్నప్ప, సెమినార్ కన్వీనర్ ఆకుల రవి

# పరిశోధనాంశాలపై పట్టు సాధించేలా..

- ఎంజీయూలో ముగిసిన అకడమిక్ రైటింగ్ రీసెర్చ్ శిక్షణ

రామగిరి, ఏప్రిల్ 20 : నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిశోధన అంశాల్లో ముందుకు సాగుతున్నది. ఐసీఎస్ఎస్ఆర్ సౌజన్యంతో యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో 'అకాడమిక్ రైటింగ్ ఫర్ పీహెచ్‌డీ స్కాలర్స్ అండ్ యువ టీచర్స్' అంశంపై ఈ నెల 18న చేపట్టిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. దీనికి ఎంజీయూతోపాటు వివిధ యూనివర్సిటీల నుంచి పీహెచ్‌డీ స్కాలర్స్, ఎంఈడీ, బీఈడీ అధ్యాపకులు, డిగ్రీ, పీజీ కళాశాలలలోని కామర్స్, ఎంబీఏ సోషల్ సైన్స్ విభాగాల యువ అధ్యాపకులు 39 మంది హాజరయ్యారు. అత్యంత నిపుణులైన సీనియర్ ప్రొఫెసర్స్ శిక్షణ అందించి స్ఫూర్తి నింపారు. రోజూ ఐదు సెషన్లలో పరిశోధన అంశాలు, అకాడమిక్ రైటింగ్ ఫర్ రీసెర్చ్‌పై ఐసీఎస్ఎస్ఆర్, ఐపీఈ, ఓయూ, పాలమూరు, ఎంజీయూ నుంచి నిపుణులు హాజరై శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా పరిశోధనల్లో గుణాత్మక విధానం, రీసెర్చ్ ప్రపోజల్స్ తయారీ, అకాడమిక్ రైటింగ్, పరిశోధన పత్రాల ప్రచురణ, డాటా సేకరణ, ఎనాలాసిస్, ఫైండింగ్స్, ఇంటప్రిటేషన్స్‌తోపాటు పలు అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, ప్రాక్టికల్‌గా వివరించారు. శిక్షణలో ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ బి.సుధాకర్‌రెడ్డి, ఓయూ ప్రొఫెసర్లు ప్రశాంత ఆత్మ, ఏఎస్ చక్రవర్తి, చెన్నప్ప, ఐపీఈ ప్రొఫెసర్ వై.రామకృష్ణ, ఎంజీయూ ప్రొఫెసర్ కొప్పులు అంజిరెడ్డి, పాలమూరు ప్రొఫెసర్ అనురాధ, వర్క్‌షాప్ కన్వీనర్, ఎంజీయూ కామర్స్ హెచ్‌ఓడీ ఆకుల రవి, కో కన్వీనర్‌గా కె.శ్రీదేవి పాల్గొన్నారు.

### నిపుణులు విభిన్న అంశాలు చెప్పారు



నేను బీఈడీ కళాశాల అధ్యాపకునిగా పనిచేస్తున్నా. బీఈడీ 2023–25 విద్యా సంవత్సరం బ్యాచ్ నా ల్గో సెమిస్టర్ లో రీసెర్చ్ గ్రంథాన్ని విద్యార్థులకు అందించాల్సి ఉంది. ఎంజీయూలో అకాడమిక్ రైటింగ్ ఫర్ రీసెర్చ్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన. నిపుణులైన ప్రొఫెసర్స్ రీసెర్చ్ చేసే విధానం, అకాడమిక్ రైటింగ్, పరిశోధనకు ఉపయోగపడే వెబ్‌సైట్‌లో అంశాల సేకరణపై వివరించారు. ముఖ్యంగా ప్రొఫెసర్లు వై.రామకృష్ణ, సుధాకర్ రెడ్డి, అంజిరెడ్డి చెప్పిన విషయాలు స్ఫూర్తి కలిగించాయి.

- ఎ.జగదీశ్వర్‌రెడ్డి, సీనియర్ అధ్యాపకుడు, బీఈడీ, మిర్యాలగూడ

### ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నా



నేను గతంలో ఇతర యూనివర్సిటీల్లో నిర్వహించిన శిక్షణకు హాజరయ్యాను. కానీ ఎంజీయూ నిర్వహించిన అకాడమిక్ రైటింగ్ ఫర్ పీహెచ్‌డీ స్కాలర్స్ అండ్ యంగ్ టీచర్స్ శిక్షణలో ఎన్నో కొత్త పరిశోధన విషయాలు నేర్చుకున్నా. ప్రొఫెసర్లు ప్రశాంతి ఆత్మ, రామకృష్ణ, ఏఎస్ చక్రవర్తి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అర్థమయ్యేలా అనేక విషయాలు వివరించారు. పీహెచ్‌డీ చేయడానికి అవసరమైన చాలా అంశాలను శిక్షణలో నేర్చుకున్నాను.

- జె.ప్రశాంతి, టీజీఎంజేఆర్‌జేసీ, నకిరేకల్

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం



మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడిసిన ధాన్యం రాశులు

మోత్కూరు/వలిగొండ/మోటకొండూర్, ఏప్రిల్ 20 : జిల్లాలో పలుచోట్ల ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. మోత్కూరు, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, మోటకొండూర్, వలిగొండ మండలాల్లో వర్షానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోతకొచ్చిన వరిచేలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి కొట్టుకుపోయింది. మోటకొండూర్ మండలం చాడ.. వలిగొండ మండలం టేకులసోమారం గ్రామం వద్ద భువనగిరి–నల్లగొండ ప్రధాన రహదారిపై రోడ్డుపై భారీ వృక్షాలు విరిడి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## అదుపు తప్పి ఆర్టీసీ బస్సు బోల్తా

- 30 మందికిపైగా గాయాలు

చింతలపాలెం, ఏప్రిల్ 20 : ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం జేలోడు కుంట కట్ట మైసమ్మ గుడి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ప్రయాణికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోదాడ నుంచి నక్కగూడెం వెళ్తున్నది. ఈ క్రమంలో చింతలపాలెం శివారులోని జేలోడు కుంట, కట్ట మైసమ్మ గుడి వద్దకు రాగానే అకస్మాత్తుగా బస్సు స్టీరింగ్ రాడ్డు విరగడంతో బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. గమనించిన స్థానిక యువకులు, సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. బస్సు బోల్తా పడిన సమయంలో 65 మంది ప్రయాణికులు ఉండగా, 5 నుంచి 10 మందికి తీవ్ర గాయాలు, 20 నుండి 30 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లు, ప్రైవేట్ వాహనాల ద్వారా మేళ్లచెర్వు, హుజూర్‌నగర్, కోదాడ, ఖమ్మం ఆసుపత్రులకు తరలించారు. ఈ బస్సు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని కూడా ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలానికి కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్ రెడ్డి చేరుకొని వివరాలు సేకరించారు.



బోల్తా పడిన ఆర్టీసీ బస్సు



సమావేశంలో మాట్లాడుతున్న కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

## రజతోత్సవ సభకు దండులా కదలాలి

- పెద్ద ఎత్తున తరలివచ్చి ఉద్యమ స్ఫూర్తిని చాటాలి
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మునగాల, ఏప్రిల్ 20: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27 జరిగే బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ సభకు కోదాడ నియోజకవర్గం నుంచి ఉద్యమ స్ఫూర్తితో దండులా కదలిరావాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మునగాల మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం రజతోత్సవ సభ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయాము గానీ ప్రజల గుండెలో ఉన్నామని అన్నారు. ఈ రజతోత్సవ సభ పార్టీ సభ కాదని, జనం సభని, కాంగ్రెస్ పార్టీ 16 నెలల పాలనలో ప్రజలు విసుగు చెంది రాష్ట్రంలో ప్రభుత్వం మారాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ సభకు హాజరయ్యే పార్టీ శ్రేణులు, అభిమానులను చూసి కాంగ్రెసోళ్ల గుండెల్లో రైళ్లు పరుగెత్తాలని చెప్పారు. ఈ నెల 27న ఉదయం పార్టీ జెండాలను ఆవిష్కరించి వరంగల్ సభకు బయల్దేరాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తొగరు రమేశ్, నాయకులు సుంకరి అజయ్ కుమార్, కందిబండ సత్యనారాయణ, సీతరాములు, రామిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రదీప్, ఉడుం కృష్ణ పాల్గొన్నారు.

# పాలనలో ఇన్‌చార్జిలే దిక్కు..

## యాదాద్రి జిల్లాలో కుంటుపడుతున్న పరిపాలన

- నెలకు పైగా అదనపు కలెక్టర్ పోస్టు ఖాళీ
- సంక్షేమ శాఖలకు అధికారులేరి..?
- ఆరు మండలాల్లో ఇన్‌చార్జి తాసీల్దార్లు
- పేరుకుపోతున్న దస్త్రాలు.. పథకాల అమలుపై ప్రభావం
- ఇబ్బందులు పడుతున్న జిల్లా ప్రజలు



యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లాలో ఇన్‌చార్జిల పాలన నడుస్తున్నది. కీలక శాఖలకు పెద్దాఫీసర్లు లేకపోవడంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారి అడ్మినిస్ట్రేషన్ కుంటుపడుతున్నది. కొత్త పథకాల అమలు తీరుపై ప్రభావం పడుతున్నది. అంతే కాకుండా పెద్ద సంఖ్య లో వివిధ విభాగాల ఫైళ్లు కుప్పలు తెప్పలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### నెల దాటినా అదనపు కలెక్టర్ పోస్టు భర్తీ ఏదీ..?

జిల్లాలో కలెక్టర్ తర్వాత కీలకమైన అధికారులు అదనపు కలెక్టర్లు. ఒకరు స్థానిక సంస్థలు, మరొకరు రెవెన్యూ బాధ్యతలు చూస్తుంటారు. కానీ ఏసీఎల్‌బీ పోస్టు నెల రోజులుగా ఖాళీగా ఉంది. ఇక్కడ అదనపు కలెక్టర్‌గా పనిచేసిన గంగాధర్ గత నెల 13న హెచ్‌ఎండీఏ కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. రెవెన్యూ అదనపుకు కలెక్టర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు పర్సన్ ఇన్‌చార్జి కూడా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలకే ఇచ్చిన విషయం తెలిసిందే.

### సంక్షేమ శాఖలదీ అదే తీరు..

జిల్లాలో సంక్షేమ శాఖలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కయ్యారు. ఎస్సీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖలకు జిల్లా అధికారులే లేరు. ఇతర విభాగాల ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిగా ఉన్న జయపాల్ రెడ్డి హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో హాస్టళ్ల అధికారి వసంత కుమారికి ఇన్‌చార్జిగా బాధ్యతులు అప్పగించారు. గిరిజన సంక్షేమ శాఖ పోస్టు రెండున్నరేండ్లుగా ఖాళీగా ఉంది. గతంలో పనిచేసిన మంగ్తానాయక్ ఏసీబీకి పట్టుబడటంతో పోస్టు ఖాళీ అయ్యింది. డీఆర్‌డీఓకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇక మైనార్టీ శాఖ సంక్షేమ శాఖ అధికారి బదిలీపై వెళ్లి రెండేండ్లు దాటింది. ఆయన స్థానాన్ని ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు.

### ఆరు మండలాలకు ఇన్‌చార్జి తాసీల్దార్లు..

జిల్లాలో 17 మండలాలు ఉండగా, ఆరు చోట్ల ఇన్‌చార్జి తాసీల్దార్లతో నెట్టుకొస్తున్నారు. ఇందులో కొందరు సెలవుపై వెళ్లగా, మరికొందరు అవినీతి ఆరోపణలతో సస్పెండ్, పదవి విరమణ పొందారు. భువనగిరి, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్, యాదగిరిగుట్ట, మోత్కూరు, గుండాల మండలాలకు తాసీల్దార్లు లేరు. భువనగిరి, యాదగిరిగుట్ట, గుండాల మండలాల తాసీల్దార్లు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. పోచంపల్లి, మోత్కూరు పదవి విరమణ పొందారు. దీంతో మండలాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక యాదగిరిగుట్ట, భువనగిరి సబ్ రిజిస్ట్రార్లు సైతం ఇన్‌చార్జిలే కావడం గమనార్హం.

### ఫైల్స్ పెండింగ్.. పథకాలపై ప్రభావం

జిల్లాలో కీలక అధికారులు లేకపోవడతో ఫైళ్లన్నీ పెండింగ్‌లో పడిపోతున్నాయి. వందల కొద్దీ దస్త్రాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. వేసవి నేపథ్యంలో అనేక చోట్ల నీటి ఎద్దడి నెలకొంది. సదరు సమస్య పరిష్కరించాలంటే ఉన్నతాధికారుల అనుమతి కావాల్సిందే. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసంతోపాటు పలు పథకాలను తీసుకొచ్చింది. వీటి అమలులో కిందిస్థాయి అధికారుల నుంచి జిల్లా అధికారుల వరకు క్షేత్రస్థాయిలో పని చేయాల్సి ఉంటుంది. ఇటీవల యువ వికాసం పథకంలో భాగంగా ఆయా సంక్షేమ శాఖలు దరఖాస్తులు స్వీకరించగా, అధికారులకు తిప్పలు తప్పలేదు. భూభారతి కార్యక్రమం తీసుకురావడంతో రెవెన్యూ సదస్సులు నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు, క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ల జారీ, భూముల పంచాయతీలు తదితర అంశాలతో తాసీల్దార్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మళ్లీ పక్క మండలాలకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.